గల్పిక

# నువ్వేం చేశావు?

"కృష్ణ"

అడయారు దివ్యజ్ఞాన సమాజమువారి గేటు ప్రాంతాన్ని ఆగింది బస్సు. ఒక అగ్రజాతి కుటుంబమూ ఇద్దరు పాటకపుస్త్రీలూ బస్సువైపు కదిలారు. పిల్లలూ పెద్దలూ, కుటుంబము వారూ ఎక్కారు బస్సు. పాటకపు స్త్రీలలో చిన్నది పధ్నాలుగేళ్ళది ఏడ్చింది. రెండోది ఓదారుస్తోంది, "ఫరవాలేదమ్మా. భయపడి బెంగపెట్టుకోకు. నీకు కడుపునిండా బువ్వ ఉంటుంది. నీ జీతములో నాలుగురూపాయలు మిగిలితే ముక్కుపుడక, దుద్దులు, చేయించుకుందువుగాని." బస్సు బయల్దేరింది....ఇది నాలుగునెలలక్రితము జరిగినఘటన. నా మెదడులో ముద్రపడిపోయింది. నేడు మళ్ళీ ఆ పిల్ల తిరిగి వచ్చేసింది ఇంటికి. ఇరుగు పొరుగు వాళ్లు చేటలంత ముఖాలుచేసుకుని వల్లిని ప్రత్యుత్థానం చేస్తున్నారు.

వల్లి తల్లికి వంట్లో బాగులేదు. ఎముకలూ చర్మమూ మిగిలేయి. చచ్చిపోతానని ఉత్తరం రాయించిందట వల్లిని పంపమని. ఆ సంపన్నులు వెంటనే పంపివేశారు. వల్లితండ్రి చేతిబండిలాగి రోజుకి రూపాయి సంపాదిస్తాడు. తల్లి పనిచేసే స్థితిలోలేదు. ఒకపిల్ల ఎనిమిదేళ్ళది, ఇంకొకతె నాలుగేళ్ళది, పదినెలల చేతిపిల్లవాడు. వల్లి ఆరు రూపాయలుతెచ్చి తల్లిచేతిలో పెట్టింది.

"రేపటినుంచి వల్లి ఏంచెయ్యాలి? పనిలో చేరితే మూడుపూటలా భోజనం ఎవరూ పెట్టరు. ఒక పూట తిండిపెట్టి నాలుగు రూపాయలు ఇస్తారు. ఆ రూపాయలు వల్లికే రెండోపూటకి సరిపోవు. వల్లి చెల్లెళ్ళు పని చెయ్యలేరు. మరి బ్రతకడమెలాగ?" అని అడిగేను స్నేహితుల్ని మెరీనాలో ఇసుకమీద కూర్చున్నప్పుడు. ఎవరూ మాట్లాడలేదు. "తిండి కావాలంటే పని చెయ్యాలికదూ, పని చేస్తుంది వల్లి, తిండిచాలదు. ఎలాబతకాలి?" మళ్ళీ అలాగే ఎవరూ మాట్లాడలేదు. "ఊరుకుంటేకాదు. మనం స్వతంత్ర భారత పౌరులం. తప్పు ఎవరిమీదో పడవెయ్యడానికి వీలులేదు. ఏలాగ బ్రతకాలి ఆ కుటుంబం?"

"ముష్టి."

"ఎవ్వరేనా ముష్టిపెడతారా యీరోజుల్లో? ఇందాకా బిడ్డనెత్తుకు వచ్చిందే ఆడమనిషి, మనమేమిచ్చామూ?"

"ఈ సమస్యలు వ్యక్తులు తీర్చగలిగినవి కావు. ప్రభుత్వం పట్టుకోవాలి."

"ప్రభుత్వమంటే మనమే. ఇంకా పైవాళ్ళవరున్నారూ... చేస్తోంది ప్రభుత్వం. బిచ్చగాళ్ళకందరికీ పని కల్పించడానికి పూర్ హావుసు పెట్టింది. బిచ్చగాళ్ళు కాపలావున్న గూర్ఖావాడికి లంచం పెట్టి తప్పించుకొచ్చేశారు."

"అందికే బిచ్చము ఇవ్వకూడదు"

"ఒప్పుకున్నాను. మరి ఆ కుటుంబముమాట?"

"ఏదేనా పని చూసుకోవాలి."

"ఎవరు అందులో? ఎక్కడ?"

"వందలు తెచ్చుకోగలిగిన మనలోనే కుటుంబమంతా ఒక్కడిమీద ఆధారపడలేక పోతోంది. రోజుకి రూపాయి తేగలిగిన వాడి ఒక్కడి మీద నాలుగు ప్రాణాలు ఆధారపడితే ఎలాగ?"

"వల్లితల్లికి వంట్లో బాగున్నప్పుడు పిడకలుచేసి, పుల్లలేరి, పాచిపనిచేసే ఏదో తెచ్చేది. చిన్నపిల్లాడు పుట్టిన తర్వాత దాని వంట్లో ఏదోరోగం ప్రవేశించింది."

"హాస్పిటలులో చేరిఉంటే?"

"చేర్చుకోలేదుట. వాళ్ళుచేర్చినా ఈ బిడ్డనెవరు చూస్తారూ అంటుంది."

"అన్నీ చిక్కులే. నిజమా? అల్లికా?"

"రా. చూపిస్తాను...ఇప్పుడు."

"నన్నేం చెయమంటావ్?"

"ఏం చెయ్యమనను రా బాబూ ఏం చెయ్యాలనే అడుగుతూంట! ఏంచేసి అడుగుతున్నామా ప్రశ్న? ప్రభుత్వంచెయ్యాలిట. నువ్వేంచేశావు?"